ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 13-11-2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడి ఘటనలో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో బీఆర్ఎస్ నేత , కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.
2. పట్నం నరేందర్ రెడ్డి అరెస్టును ఖండించిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు ప్రజలు చేసిన తిరుగుబాటును తమ పార్టీకి ఆపాదించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు.
3. ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ ( IGDC) 16వ సదస్సు నేటి నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ లోని HICC లో జరుగుతుంది.
4. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 21, 22 తేదీల్లో హైదరాబాద్ పర్యటనకు రానున్నారు.

**లగచర్ల-నరేందర్ రెడ్డి అరెస్టు**

వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో కలెక్టర్ పై దాడి చేసిన ఘటనలో నిన్న అరెస్టయిన 16 మందిని పోలీసులు రిమాండ్ కు తరలించారు. ఈ క్రమంలో దాడిలో కీలక సూత్రధారిగా భావిస్తున్న సురేష్ కోసం గాలింపులు చర్యలు

చేపట్టారు. సురేష్ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి తో పలుమార్లు ఫోన్లో సంభాషించినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో నరేందర్ రెడ్డి పాత్ర ఉందన్న అనుమానంతో ఈ ఉదయం హైదరాబాద్ లో ఆయనను అదుపులోకి తీసుకొని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు మహేష్ రెడ్డి , మెతుకు ఆనంద్ శిక్షణ కేంద్రానికి చేరుకొని నరేందర్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని వారు ఆరోపించారు.

**(స్ట్రింగర్), వికారాబాద్**

-------------------------------

**లగచర్ల-కేటీఆర్**

బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డితో పాటు లగచర్లలో అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గంలో ప్రజలు చేసిన తిరుగుబాటును బీఆర్ఎస్ పార్టీకి ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తమ కార్యకర్తలతో మాట్లాడినా కూడా ప్రజా ప్రతినిధులను అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు తిరగబడుతుంటే వారిని అణిచివేసేందుకు లగచర్లలో అప్రజాస్వామిక చర్యలకు దిగారన్నారు. పట్నం నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ

అరెస్ట్ లు తప్పవని బెదిరిస్తోం దని ఆరోపించారు.

**(డెస్క్)**

-----------------------------

**లగచర్ల అరెస్టు-హరీశ్ రావు**

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు , ముందస్తు నిర్బంధాలు విధిస్తూ రాజకీయ కక్ష తీర్చుకుంటోందని బీఆర్ఎస్ నేత , మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

**(డెస్క్)**

---------------------

**అరెస్ట్-సబితా ఇంద్రారెడ్డి**

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అరెస్ట్ ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఖండించారు. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ప్రజల గొంతుకై ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత అని తెలిపారు.

**(డెస్క్)**

--------------------------------

**పాలమూరు రంగారెడ్డి-చిన్నారెడ్డి**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నిన్న సాయంత్రం చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

**స్ట్రింగర్, మహబూబ్ నగర్**

-------------------

**IGDC -గేమింగ్ సదస్సు**

ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ ( IGDC) 16వ సదస్సు ఈ రోజు నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ HICC లో జరగనుంది. గేమ్ డెవలపర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (GDAI) నిర్వహిస్తున్న ఈ సదస్సు గేమింగ్, ఇంటరాక్టివ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ప్రపంచంలోని మూడు అతిపెద్ద ఈవెంట్లలో ఒకటిగా ఉంది. దేశ గేమింగ్, వినోద రంగాల్లో చోటు చేసుకుంటున్న వృద్ధికి నిదర్శనంగా నిర్వాహకులు చెబుతున్నారు. మూడు రోజుల ఈ సదస్సుకు దాదాపు 20 వేల మంది హాజరావుతున్నారు. కేంద్ర సమాచార , ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు , పలువురు సీనియర్ అధికారులు మొదటిరోజు చర్చల్లో పాల్గొంటున్నారు. సదస్సులో 150కి పైగా సెషన్‌లు ఉండగా , వివిధ అంశాల్పై 250 మంది పైగా నిపుణులు ప్రసంగిస్తారు.

(MSL)

-----------------------------

**ఎల్ఐసి - కళాజాతా**

'ప్రజాధనం - ప్రజా ప్రయోజనం కోసం ' అనే నినాదంతో ఎల్ఐసి ఉద్యోగుల ఆధ్వర్యంలో కళాజాత మొదలయ్యింది. ఎల్ఐసి జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ ఈ ఉదయం హైదరాబాద్ లోని జోనల్ కార్యాలయంలో ఈ జాతరను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎల్ఐసి ఏజెంట్లు , డెవలప్మెంట్ ఆఫీసర్లు , అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం నాయకలు హాజరయ్యారు. ప్రభుత్వ రంగాలను ముఖ్యంగా భీమారంగాన్ని మరింత బలపరచాలన్నది ఈ జాతా ప్రధాన ఉద్దేశం.

(పీఎస్)

----------------------------------

**పీఎం-కాచిగూడ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దేశవ్యాప్తంగా 18 ప్రదేశాల్లో పీఎం భారతీయ జన ఔషది కేంద్రాలను ద్రుశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు. దీంట్లో హైదరాబాద్ కాచిగూడ రైల్వే స్టేషన్ లోని కేంద్రం కూడా ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేడు 18 ప్రధాన మంత్రి బారతీయ జన ఔషధీ కేంద్రాలను నరేంద్ర మోదీ ప్రారంభించడం వాటిలో కాచిగూడ రైల్వే స్టేషన్ లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు

చేయడం శుభ పరిణామం అన్నారు.   దీని ద్వారా తక్కువ ధరలకే నాణ్యమైన ఔషదాలు ప్రజలకు లభిస్తాయని తెలిపారు.

**(పీటీసీ,హైదరాబాద్)**

-------------------------------

**గూడ్స్ రైలు బోల్తా**

పెద్దపల్లి జిల్లాలో రామగుండం - పెద్దపల్లి స్టేషన్ల మధ్య ఉన్న రాఘవాపూర్ వద్ద నిన్న రాత్రిగూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో బోగీలు బోల్తాపడటంతో ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్ళు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఆయా రూట్లలో వెళ్లాల్సిన 31 రైళ్లు పూర్తిగా రద్దయాయి. పది కి  పైగా రైళ్లను పాక్షికంగా రద్దు చేసి మరికొన్నింటిని దారి మళ్లించారు. గూడ్స్ రైలు బోల్తాతో రైల్వే అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు.

**(పెద్దపల్లి పీటీసీ)**

--------------------------

**గూడ్సు రైలు-పెద్ద పల్లి ఎంపీ**

కాగా, ఈ ఘటనపై  పెద్దపల్లి లోక్ సభ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ   వివరాలు అడిగి తెలుసుకున్నారు.  దక్షిణ మధ్య రైల్వే అధికారులకు ఫోన్ చేసి రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు.     పెద్దపల్లి,  రామగుండం,

మంచిర్యాల,  బెల్లంపల్లి మార్గంలోని ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

**(పిటిసి, మంచిర్యాల)**

**------------------------**

**రాష్ట్రపతి-సీఎస్**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21, 22 తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్ నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో ఈ రోజు సమావేశమయ్యారు. రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రపతి బస చేసే బొల్లారం లోని రాష్ట్రపతి నిలయం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత శాఖను ఆదేశించారు. అన్ని వేదికల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ జితేందర్ , హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా , ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**(పీఎస్)**

**----------------------------**

**సమగ్ర సర్వే-నల్లగొండ**

రాష్ట్రంలో సామాజిక , ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతోంది. అన్ని జిల్లాల్లో గణకులు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. సర్వేకు వచ్చే గణకులకు చూయించేందుకు ప్రజలు ఆధార్, రేషన్ కార్డు , పట్టాదారు పాస్ పుస్తకం వంటివి సిద్ధంగా ఉంచుకునేలా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.

**(పిటిసి, నల్లగొండ జిల్లా)**

-----------------------------

**సర్వే -యాదాద్రి**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండల కేంద్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో పాల్గొని కుటుంబ సభ్యుల వివరాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధికారులకు వెల్లడించారు. ప్రజలు కుటుంబ సర్వేలో అధికారులకు సహకరించాలని కోరారు. కుటుంబ సర్వే పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉందని వివరించారు.

**(పీ టీ సీ, యాదాద్రి భువనగిరి)**

--------------------

**వరంగల్-పోలీసు అవార్డులు**

పోలీస్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే అతి ఉత్కృష్ట సేవా పతకానికి వరంగల్ జిల్లా కేయూసి పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న మల్లారెడ్డి తో పాటు హనుమకొండ పోలీస్ స్టేషన్

కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కే. మహేష్ లు ఎంపికయ్యారు. వీరిని వరంగల్  పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

**(వరంగల్ జిల్లా పీటీసి)**

--------------------

**ఆర్మూర్-రోడ్డు మూత**

నిజామాబాద్ – ఆర్మూర్ మార్గంలో అడవి మామిడిపల్లి వద్ద ఆర్ యూబీ పనులు కొనసాగుతున్నందున రోడ్డు మూసేశారని  ,  ఈనెల  17,  18  తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల్లో పరీక్షా కేంద్రాలకు చేసుకోవాలని జిల్లా  కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. పనులతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా ఈనెల   10 నుంచి డిసెంబరు  10వ తేదీ వరకు వాహనాలు దారి మళ్లించినట్లు చెప్పారు.

**(పిటిసి, మంచిర్యాల జిల్లా)**